# పిల్లికూన

పలకలాంటి ఆకాశంలో నక్షత్రాలు అక్షరాల్లా నిశ్శబ్దంగా వున్నాయి. నిద్రపోతున్న కుర్రాడికాళ్ళు 'మ్యావు' అన్నాయి. గుండె 'మ్యావు' అన్నది. కీచురాయి 'మ్యావు' అన్నది. పెద్దవాళ్ళ గుర్రులు 'మ్యావు, మ్యావు' అన్నాయి. కుర్రాడు కొంచెం కదిలాడు. ఇంకా నిద్రపోతున్నాడు. కలా కాక, నిజంకాక మరేదో స్థితిలో కుర్రాడిముందు పిల్లికూన గెంతుతున్నది.

మూణ్ణాల కిందట ఎక్కణ్ణుంచో, ఓ పిల్లి వచ్చి అటక మీద అయిదుకూనల్ని పెట్టింది. అటకకింద చద్దన్నం తింటున్నప్పుడు మీద కూనలమూలుగులు ఆవకాయ ఊటలా కుర్రాడి నోరూరించేది. అటక ఆకాశం అంత ఎత్తుండేది.

రెండురోజుల తరువాత ఒక్కొక్కపిల్లనీ నోటకరచు మరోచోటుకి తీసుకుపోయింది. ఏడిళ్ళు తిప్పుతుంది.

ఆవేళ చద్దన్నం కుర్రాడికి సయించలేదు. అప్పడం ముక్క నంచుకొంటికి ఉన్నా చద్ది దిగలేదు. ఏదో వెలితిఅయినట్టనిపించింది. కానీ పెద్దవాళ్ళభయం చేత కుర్రాడు కంచం వట్టిది చేశాడు.

చద్దన్నంతిని బడికెళ్తున్నప్పుడుకూడా కుర్రాడికేం తోచలేదు. పలకపుల్ల విరిగిపోయినట్టో, పెన్సిలు పారేసుకొ

న్నట్టో అనిపించింది. బళ్ళో మేష్టరు పిల్లి పాఠం చెప్పాడు. పాఠంతోపాటు కథ చెప్పాడు. పిల్లలు గొల్లుమంటూ నవ్వేరు. కుర్రాడు పాఠమే వినలేదు.

కుర్రాడికీ పిల్లి పిల్లలకీ ఏదో తెలిసిలేని సంబంధం ఏర్పడ్డది. సాయంత్రం ఇంటికొచ్చేక గబగబా అటక దగ్గరకు వెళ్ళి బుర్రపై కెత్తి చూశాడు. బ్రహ్మరాక్షసి అటకకి బూజు గడ్డలా వుంది. కుర్రాడు చెవులు నిక్కపెట్టి విన్నాడు, ఏచప్పుడైనా వినబడుతుందేమో అని. మెల్లగా ఏదో మూలుగు వినబడ్డది, కుర్రాడు భయపడ్డాడు. అది పిల్లిమూలుగే, నిర్ధారణ చేసుకొన్నాడు.

మేనత్త తప్పించి ఇంటిల్లిపాదీ ఎవరింటికో వెళ్ళేరు. అత్త అటకెక్కి పాయవకాయ తీస్తున్నది. కుర్రాడు గబగబా అటకదగ్గరకు వచ్చాడు. నల్లని మేనత్త అటకతో కలిసిపోయి దుమ్ముగుండులాగ భయపెడుతూంది.

సరిగ్గా ఆ వేళకి మావ వచ్చేడు. అత్తని మావని చూడలేదు. మావ ఏవిటని అడిగేడు. కుర్రాడు, 'మావా! అటకమీద ఎలుగుబంటికాదూ?' అని ప్రశ్నించాడు. అత్తయ్య గతుక్కుమంది.

'అదుగో ఎలుగుబంటి' అన్నాడు మావయ్య.

'ఏదీ?' కుర్రాడు అటకంతా చూశాడు నిచ్చె నెక్కి.

'మీ అత్తయ్య' అన్నాడు మావ.

అత్తయ్య నవ్వుతూ మొగం దాగరంత చేసుకొంది. అత్తయ్య మావయ్య మొగుడు పెళ్ళాలు కాదు. అత్తయ్య మొగుడు అదేదో వూళ్ళో రెండేళ్ళాయి ఉన్నాడు. మావయ్యకి యింకా పెళ్ళికాలేదు.

‘ఇంట్లో ఎవరూ లేరులే’ అన్నాడు మావ.

‘ఏదీ?’ అన్నది అత్త.

ఇద్దరూ నవ్వుకున్నారు. కుర్రాడికేం అర్థం కాలేదు.

అటకనుండి అత్త అవకాయ తీయడం మొదలెట్టింది. మెల్లగా ఓ మూలుగు వినబడ్డది. అత్త కాలితో కెలికి ‘పిల్లి పిల్ల’ అన్నది కుర్రాడికి కాణీదొరికినట్టనిపించి మొగం వికసించింది.

‘దీన్ని మరచిపోయింది కాబోలు!’

‘ఏమో?’

‘తీసిపారెయ్’

‘ఆవకాయ చేతులు.’

‘నే నెక్కుతా నత్తా.’

‘ఊఁ.’

కుర్రాడు అటకెక్కి పిల్లిని తీసేడు. చచ్చిపట్టుంది. పిల్లికూనతో మెల్లిగా అటక దిగాడు. మావయ్య చేతిలో కాణీపెట్టి ‘పోయి ఆడుక్కో’ అన్నాడు.

కుర్రాడు ధంగున ఎగిరి గెంతేడు. పిల్లిని తీసుకొని బయల్దేరాడు. కాణీపెట్టి మూడుసంతికలు కొన్నాడు. పిల్లికి

పెద్దే గతికిగతికి వొదిలింది. అత్త మామ నట్టింట్లో గుసగుస లాడుకొంటున్నారు.

పిల్లికి పాలుపోయించాలి. రోజూ పప్పు అన్నం కలిపి పెట్టాలి. పిల్లి పెద్దదయి బలిసాక దాంచేత ఎన్నో చేయించాలి. సర్కసులోలాగ ఎన్నో చేయించాలి.

కుర్రాడు పిల్లికూనను తీసుకొని డాబా మీదికి వెళ్ళాడు. దానిచేత మొగ్గలు వేయించాడు. రెండుకాళ్ళ మీదనే డాబాఅంతా నడిపించేడు. కడుపుమీద ఎక్కించుకొన్నాడు. పిట్టగోడమీద నిలబెట్టి కిందికి గెంతించేడు. చ సి నయ్యా అని పిల్లి ఫీట్లన్నీ చేసింది. ఫీటుకీ ఫీటుకీ మధ్య ఓ జంతిల్ ముక్క మేతవేశాడు.

సర్కసు చాలాబాగా అయింది. కుర్రాళ్ళందరినీ చేరేసి ఇక గమ్మత్తుగా సర్కస్ చేయించాలి. అవసరాన్ని బట్టి పిల్లి పిల్లే పులి అవుతుంది. సింహా మవుతుంది. ఏను గవుతుంది. గుర్ర మవుతుంది. కుర్రోడికి ఓ ఫీటు జ్ఞాపక మొచ్చింది. సింహంనోట్లో నోరుపెట్టాలి. దవడలు రెండూ సాగదీసి నోట్లో వేలుపెట్టాడు. పీనుగులాంటిపిల్లి దయ్యంలాగ బరికింది కుర్రాడికి చెడ్డకోపమొచ్చి పందుంపుల్ల కొరడాతో పిల్లిని తెగబాదాడు. మూలుగుతూ పడ్డింది కూన.

ఐపోయిం దేదో అయిపోయిందని పిల్లిని భుజానవేసు కొని డాబాదిగే డు కుర్రాడు. అమ్మమ్మ ఎదురుగుండా వచ్చింది. వస్తూనే 'అ దెందుకురా?' అని అడిగింది కోప్పడుతూ

అబ్బాయి బిక్కమొగం వేశాడు. 'పారేసిరా' అంది. కుర్రాడు మాట్లాడలేదు.

అమ్మమ్మ అన్నయ్యచేత పిల్లి నెక్కడో విసిరేయించింది. అన్న పిల్లిపిల్ల చెవులు పట్టుకున్నాడు. ఉరికంబంమీద శవంలా పిల్లి ఊగింది. కుర్రాడికి శవాన్ని ఎత్తుతుంటే వచ్చే ఏడుపు వచ్చింది. లోలోపలే కుమిలి కుమిలి ఏడ్చాడు. పిల్లి బక్కల్లు మంట పెడుతున్నాయి. అవి మానకుండానే పిల్లి వెళ్ళిపోయింది.

కుర్రాడు వీధిలోకివెళ్ళి వీధంతా గాలించేడు. పిల్లి ఎక్కడా కనుపించలేదు. ఏ బండికిందపడ్డదో, కుక్కనోట పడ్డదో, ఏ కాలువలో పడ్డదో! కుర్రాడికి ఎక్కడలేని బెంగ పట్టుకుంది. కాలుకాలిన పిల్లిలాగ పిల్లికోసం రోడ్డంతా గుంజం తొక్కాడు కుర్రాడు.

చీకటి జీమూతంలా కమ్మింది. కుర్రాడు ఇల్లుచేరుకున్నాడు. తిండితిని పడుక్కున్నాడు. ఎంతకీ నిద్రపట్టలేదు. కళ్ళువిప్పితే పిల్లిపిల్ల, కళ్ళుమూస్తే పిల్లిపిల్ల.

పట్టక పట్టక నిద్రపట్టింది. కలలోకూడా పిల్లిపిల్లే కనబడ్డది. తన అరుపుతో జాలిగా పిలుస్తోంది. వ్యక్తావ్యక్త స్థితిలో అన్ని చప్పుళ్ళూ కుర్రాడికి పిల్లికూనమూలుగులాగే వినిపిస్తున్నాయి. అరుపులన్నీ కుర్రాడిని తట్టి లేపాయి.

కుర్రాడు కళ్ళునలుపుకొని నించున్నాడు. తనపక్క అత్త ఏనుగులాగ పడుకొంది. చీకటి బూజుపట్లలాగ వేళ్ళాడుతోంది. రోడ్డుమీద పిల్లిపిల్ల ఉంటుంది. తప్పదు తెచ్చు

కోవాలి. డాబాకు మెట్లులేన ట్లనిపించింది. కుర్రాడికళ్ళకి చింతతగిలించినట్లయింది.

కళ్ళంట నీళ్లుపెట్టుకుని కుర్రాడు సాంబ్రాణి పొగలాగ కూలబడ్డాడు. వాడి ఏడుపుకూడా పిల్లికూన మూలుగు లాగే వుంది. అత్త కళ్ళుప్పి 'ఏం పడుకోరా' అని తన దగ్గరకు తీసుకొని శాలువకప్పింది. తను అత్తయ్యను అంటిపెట్టుకొని పిల్లి పిల్లలాగ వెచ్చగా ముడుచుకుపడుకొన్నాడు.